క్లుప్తంగా

కార్మికులకు సబ్బు, నూనె అందించాలి


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఏటా సంక్రాంతికి అందించే సబ్బులు, నూనె, చెప్పులను పండుగకు ముందే అందించేలా చూడాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల అశోక్ తేజ, ప్రధాన కార్యదర్శి మాదుగుల నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి నర్సయ్య, ఉపాధ్యక్షుడు కోకిల శ్రీనివాస్, సుమన్, భూమేశ్, సది, సంతోశ్, బాబు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దండేపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని దండేపల్లి మండలం పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రావనవేని రవి, మల్యాల మల్లేష్ డిమాండ్ చేశారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 క్యాలెండర్‌ను మంగళవారం సంఘ నాయకులు ఆవిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంక్రాంతి కానుకగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి చిన్నయ్య, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మనోహర్, వరలక్ష్మి, సంఘం మాజీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు


బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించారు.వ్యాసరచనలో విజేతగా నిలిచిన అభిరామ్‌తో పాటు ముగ్గుల పోటీలో గెలిచిన అంజలి, అన్వితతేజ, సహానా, రష్మితలకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, విద్యాశాఖా సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యానికి చేయూత


నగదు అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

జన్నారం: తన వద్ద చదివే విద్యార్థి అనారోగ్యంపాలు కావడంతో ఏదైనా సాయం అందించాలని ఆ విద్యార్థి వివరాలను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకోగా చూసిన దాతలు స్పందించి, బాలుడి వైద్య ఖర్చులకు సాయం అందించారు. పోగయిన రూ.28వేలు మంగళవారం ఆ విద్యార్థి తల్లికి అందజేసి ఉదారత చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన భూపెల్లి ప్రసాద్, రాణిల కుమారుడు వర్షిత్ అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. చదువులో ఎంతో చురుగ్గా ఉండే వర్షిత్ గత సంవత్సరం క్రితం బ్లడ్ క్యాన్సర్ బారిన పడ్డాడు. నిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్తే సుమారుగా రూ.10లక్షల వరకు ఖర్చవుతాయని తెలిపారు. ఈ విషయం తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న అదే పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి ఈ విషయాన్ని తన వాట్సాప్ స్టేటస్, సోషల్ మీడియాలో పోస్టు చేసింది. స్పందించిన దాతలు వర్షిత్ వైద్య ఖర్చుల నిమిత్తం తోచినంత సాయం ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చేశారు. దాతలు స్పందించి, విద్యార్థి వైద్యానికి సాయం అందించాలని కోరారు.

బల్దియాలో తాగునీటి కటకట..!

- రెండు నెలలుగా మంచిర్యాల టూటౌన్ ప్రాంత ప్రజల ఇబ్బందులు
- రోడ్డు వెడల్పుతో పైప్‌లైన్ వేయలేని పరిస్థితి


హమాలీవాడలో డ్రెయినేజీ నుంచి వెళ్తున్న తాగునీటి పైపులైన్

మంచిర్యాలటౌన్: గ్రేడ్ 1 మున్సిపాలిటీగా ఉన్న మంచిర్యాల పట్టణంలోని టూటౌన్ ప్రాంత ప్రజలు రెండు నెలలుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. హమాలివాడలోని అండర్‌బ్రిడ్జి రోడ్డు నుంచి తిలక్‌నగర్ వరకు 60ఫీట్ల రోడ్డు కోసం ఏడాది క్రితం రోడ్డును ఇరువైపులా తవ్వి వదిలేశారు. రోడ్డు పనులను పూర్తి చేయకపోవడంతో డ్రెయినేజీ నీరు రోడ్డుపైనే పారుతుండగా, తాగునీటి పైపులను వేయగా, అవి కూడా మురికి నీటిలోనే ఉన్నాయి. రోడ్డు పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న నిర్లక్ష్యంతో, తాగునీటి పైప్‌లైన్ పనులు పూర్తికావడం లేదు. దీంతో రెండు నెలలుగా హమాలివాడ, సాయిబాబ ఆలయం నుంచి పోచమ్మ గుడి వరకు ఉన్న ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి ట్యాంకర్ ద్వారా ఆ ప్రాంత ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నా, ట్యాంకర్ ఎప్పుడు వస్తుందో తెలియక, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బయట మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నివసించే వారిలో ఎక్కువ మంది పేదవారే కావడంతో, తాగునీరు కొనుక్కోలేని పరిస్థితి. రోడ్డు వెడల్పు పనుల్లో జరుగుతున్న జాప్యంతో దుమ్ము, దూళితో పాటు, డ్రెయినేజీ నీరు రోడ్డుపైనే పారి ఇబ్బందులు ఓ వైపు, తాగునీటి ఇబ్బందులు మరోవైపు ఈ ప్రాంత ప్రజలను వెంటాడుతున్నాయి. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందించినా, ప్రతిరోజు ఒక సమయాన్ని కేటాయించి పంపిణీ చేసేలా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న డీపీఆర్వో సంపత్‌కుమార్

మంచిర్యాలఅగ్రికల్చర్: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ సంతోష్‌కు మంగళవారం జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి వై.సంపత్‌కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ వివిధ శాఖల ఉద్యోగులు కూడా శుభాకాంక్షలు తెలయజేస్తూ పూలబుకే అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో నూతన ప్యానల్ మెంబర్స్ తిరుపతి, రామ్‌కుమార్, మల్లేష్, రమణ, సతీష్‌కుమార్, విజయ, శ్రీదేవి, ప్రజ్ఞ, రాధా, పావని పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మందమర్రి జీఎం

మందమర్రిరూరల్: కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌ను మందమర్రి ఏరియా జీఎం మనోహర్ మంగళవారం మంచిర్యాలలోని కలెక్టర్ ఆఫీస్‌లో కలిసి మొక్కను అందించి నూతన సంవత్సర(2024)శుభాకాంక్షలు తెలిపారు. మందమర్రి ఏరియాలోని కేకే–2 ఓసీకి సంబంధించిన భూ సమస్యలపై చర్చించినట్లు, సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు జీఎం తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూర్: తమ తోటి మిత్రుడి కుటుంబానికి ఆ మిత్ర బృందం ఆర్థిక సాయం అందించి కొంత తోడుగా నిలిచింది. 1990–91 తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మిత్ర బృందంలో బుచ్చయ్య అనే మిత్రుడు కొద్దిరోజుల క్రితం మరణించాడు. దీంతో ఆ బ్యాచ్ మిత్రులు కొంతమంది రూ.పదివేలు నగదును పోగు చేసి మంగళవారం బుచ్చయ్య భార్యకు అందజేశారు. కార్యక్రమంలో జంపాల వసంత్, వామన్, సత్యనారాయణ, రాంమూర్తి, గాజుల రమేష్, మేడి మధు, తొగరి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్


దరఖాస్తు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్

దండేపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని వెల్గనూర్‌లో మంగళవారం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. దరఖాస్తు దారులతో మాట్లాడారు. దరఖాస్తులు గ్రామ పంచాయతీ వారు ఇచ్చారా? లేదా బయట కొనుగోలు చేశారా అనే దానిపై ఆరా తీశారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తును తెల్లకాగితంపై రాసి ఇస్తే సరిపోతుందన్నారు. అధికారులు దరఖాస్తు దారులు అడిగే సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అర్హులందరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

గురుకులాల ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం అవగాహన కల్పించేలా తయారు చేసిన పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తన నివాసంలో ఆవిష్కరించారు. నాణ్యమైన ఉచిత విద్యా బోధనతో పాటు, అన్ని రకాల వసతి సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ గురుకులాల్లో ఐదో తరగతిలో అడ్మిషన్ పొందేందుకు గాను ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల బాల బాలికలు సంబంధిత వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయ సంస్థల ఆదిలాబాద్ రీజియనల్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, డీసీవో రామాల బాల భాస్కర్, ప్రిన్సిపాల్ లలితకుమారి, మోహన్, ఉపాధ్యాయులు మహేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వసతి గృహ సంక్షేమ సంఘం సభ్యులు

మంచిర్యాలటౌన్: వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి కిషోర్‌కుమార్, కేజియా, సునిత, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జీఎం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మంగళవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావును కలిశారు. మంచిర్యాలలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

భీమదేవర జెండా పండుగను ఘనంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

కోటపల్లి: ఆదివాసీ కొలావార్ల ఆత్మగౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమదేవర జెండా పండగను రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 8న ఆదివాసీ కొలావార్లు ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ కొలావార్ సంఘం మండల అధ్యక్షుడు అత్రం మధుకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ కొలావార్ల పీవీటీజీ సమస్యను త్వరగా పరిష్కరించాలన్నారు. కొలావార్ల గూడాల్లో సంస్కృతి సంప్రదాయలతో ప్రతిఒక్క ఆదివాసీ బిడ్డ భీమదేవరా జెండా పండగను జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కొలావార్ సేవాసంఘం మండల ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, ఉపాధ్యక్షుడు ఈగం లక్ష్మణ్ పాల్గొన్నారు.


దేవాపూర్‌లో కోలాటాలతో ఊరేగింపు


తిరుమలగిరి కాలనీలో అక్షింతల శోభాయాత్ర

అక్షింతల శోభాయాత్ర

మంచిర్యాలఅర్బన్/మందమర్రిరూరల్/తాండూర్/బెల్లంపల్లిరూరల్/కాసిపేట/చెన్నూర్ రూరల్/భీమారం: అయోధ్యలోని శ్రీరాముని పాదాల చెంత నుంచి వచ్చిన పవిత్రమైన అక్షింతలు జిల్లా వ్యాప్తంగా, పలు మండల కేంద్రాల్లో మంగళవారం రాత్రి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పల్లకిల్లో ఉంచి మహిళలు మంగళహారతులతో, యువకులు కాషాయ ధ్వజాలు చేతబూని నృత్యం చేస్తూ ర్యాలీలు తీశారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.


తాండూర్‌లో శోభాయాత్ర


మందమర్రిరూరల్: పొన్నారంలో శోభాయాత్ర


భీమారంలో...

ఆరు గ్యారంటీలు అద్భుతమైనవి

- అర్హులైన ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తు చేసుకోని వారికి అధికారులు ఫోన్లు చేయాలి
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారంటీ స్కీంలు అన్నీ కూడా అద్భుతమైనవని, అర్హులైన ప్రజలందరూ తప్పక దరఖాస్తు చేసుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వివేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500, గ్యాస్ సిలిండర్ కేవలం రూ.500కే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు వంటి పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు ఉంటేనే దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఏది లేదని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు కూడా త్వరలోనే అందుతాయన్నారు. గతంలో ప్రగతిభవన్‌కు వెళ్లే పరిస్థితే ఉండేది కాదని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వమే ప్రజల వద్దకు చేరువైందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేయని వారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లాలని, ప్రతీ ఇంటికి ఫోన్లు చేస్తూ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సాహించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారో రోజువారిగా తనకు నివేదిక పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేషాద్రి, తహసీల్దార్ చంద్రశేఖర్, క్యాతనపల్లి మున్సిపల్‌చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పేదల అభ్యున్నతి కోసమే ప్రజాపాలన’

చెన్నూర్: పేదల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం ప్రజాపాలన తీసుకొచ్చిందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంటకస్వామి అన్నారు. స్థానిక 1వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు దిశగా అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, డీఆర్‌డీవో శేషాద్రి, 1వ వార్డు కౌన్సిలర్ పోగుల సతీశ్, మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి, కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు జగన్నాథుల శ్రీనివాస్, జోడు శంకర్ పాల్గొన్నారు.

‘వివేక్‌కు కలిసిన సింగరేణి జీఎం’

చెన్నూర్: ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని శ్రీరాపూర్ ఏరియా సింగరేణి జీఎం సంజీవరెడ్డి మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎం వెంట సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళి మోహన్ ఉన్నారు.

గౌడ సంఘ భవన నిర్మాణం కోసం కృషి చేస్తా

చెన్నూర్: గౌడ కులస్తులకు సంఘ భవన నిర్మాణం, రేణుక ఎల్లమ్మదేవి ఆలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ గోదావరి రోడ్డులో గల రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో మహాహారతి పూజకు మంగళవారం హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుగా అమ్మవారి దేవాలయంలో పూజలు చేసినట్లు తెలిపారు. ఆ తల్లి ఆశీస్సులో గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, గౌడ సంఘం నాయకులు కుర్మ అశోక్, జక్కుల సత్యనారాయణ, కొరకొప్పుల నర్స గౌడ్, బెల్లంపల్లి మూర్తిగౌడ్ పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్/చెన్నూర్‌రూరల్: ప్రజలు ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేకానంద అన్నారు. చెన్నూర్‌రూరల్ మండలంలోని కిష్టంపేట, బీరెల్లి, బావురావుపేట, పొక్కూరు గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన నిర్వహించగా బావురావుపేట, పొక్కూరు గ్రామాలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. చెన్నూర్ మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి దరకాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డీఆర్డీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.


తాండూర్: దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో


జన్నారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో


బెల్లంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తూ...


బెల్లంపల్లి: దరఖాస్తు స్వీకరిస్తున్న కమిషనర్


వేమనపల్లిలో...


కాసిపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీడీవో


వేలాలలో దరఖాస్తులతో పోటీపడుతూ...

దరఖాస్తుల వెల్లువ

మంచిర్యాలటౌన్/కాసిపేట/జైపూర్/లక్సెట్టిపేట/వేమనపల్లి/తాండూర్/బెల్లంపల్లి/జన్నారం/బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి లబ్ధిదారుల నుంచి జిల్లా వ్యాప్తంగా మంగళవారం దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. దరఖాస్తులు స్వీకరించి రశీదు అందజేశారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. బెల్లంపల్లిలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తాండూర్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంచిర్యాలలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, కాసిపేటలో డీటీడీవో గంగారాం, ఎంపీడీవో ఎంఏ అలీం, తహసీల్దార్ భోజన్న, ఏవో వందన, ఏఈ వినయ్ పాల్గొన్నారు. జైపూర్‌లో పశుసంవర్థక జేడీ రమేశ్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు. లక్సెట్టిపేటలో ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, వేమనపల్లిలో ఎంపీపీ కోలి స్వర్ణలత, జెడ్పీటీసీ స్వర్ణలత, సర్పంచ్ కుబిడె మధుకర్, ఎంపీడీఓ లక్ష్మయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు జాహెద్‌అలీ, ఏఈ దీక్షిత్, ఏఓ వీరన్న, డీటీ గోవింద్ , ఏపీఎం ఉమారాణి, తాండూర్‌లో ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, ఎంపీటీసీలు సూరం రవీందర్ రెడ్డి, సిరంగి శంకర్, తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ సార్ల పద్మ, జన్నారంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అరుణరాణి, సర్పంచులు నెమలికొండ ఆశ రాజ్, విజయ, ఎంపీటీసీ మమత, బెల్లంపల్లి రూరల్‌లో ఎంపీపీ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాంచందర్, ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ ప ద్మావతి, ఉప సర్పంచ్ సుధాకార్, కో–ఆప్షన్ సభ్యుడు అశోక్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డులో...


లక్సెట్టిపేట: దాడపల్లిలో...

విద్యార్థులకు ఎన్ఆర్ఐ చేయూత



జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అమెరికాలోని డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఎన్ఆర్ఐ నవీన్ చేయూత అందించారు. పాఠశాలకు ఆయన రూ.20 వేలు పంపించగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచే 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి మంగళవారం ట్రాక్‌షూట్‌లు అందజేశారు. హెచ్ఎం కట్ట రాజమౌళి, పీడీ సాగర్, ఉపాధ్యాయులు కవిత, నర్సయ్య, రమేశ్, తిరుపతి, రాజేందర్, శ్రీనివాస్, లక్ష్మయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.